
సాక్షి జనగామ

శనివారం । 29 । జూన్ । 2024



సర్దడానికి సతమతం
సీఎంఆర్ బియ్యం లారీలు తరలివస్తున్న నేపథ్యంలో నిల్వ చేయడానికి గోడౌన్లలో సరిపడా స్థలం లేక అధికారులు సతమతమవుతున్నారు. - 8లో▸



పౌష్టికాహారం విషయంలో నిర్లక్ష్యం వద్దు
పాఠశాలల్లో పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క తెలిపారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29°/25°
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. రాత్రి పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సిద్ధేశ్వరాలయంలో వేలం
బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని శ్రీ సిద్ధేశ్వరాలయంలో వివిధ హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2వ తేదీన తలనీలాలు పోగు చేసుకొనుట, లడ్డూ, పులిహోర తయారీలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 11 గంటలకు వేలం పాటలో పాల్గొనే వారు ధరావత్ సొమ్ముతో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ. ఉద్యోగులు చల్ల రాజేందర్‌రెడ్డి, మధు, క్రాంతి, భానుప్రకాష్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సీపీని కలిసిన డీసీపీ



జనగామ: జనగామ డీసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజమహేంద్రనాయక్ శుక్రవారం సీపీ అంబర్ కిషోర్ ఝాను వరంగల్ కమిషనరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీని కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు వెస్ట్ జోన్ పరిధిలో శాంతి భద్రతలు, ఇతర విషయాలపై చర్చించుకున్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'
హన్మకొండ: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకోవడానికి ఈనెల 29న ‘డయల్ యువర్ డీఎం’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు 9866373825 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలుపాలని, సలహాలు, సూచనలు అందించాలని ఒక ప్రకటనలో కోరారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి
జనగామ రూరల్: పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను కంప్యూటర్ సైన్స్, అండ్ అప్లికేషన్‌లో 2 పోస్టులు, పొలిటికల్ సైన్స్ 1, చరిత్ర 1 పోస్టు చొప్పున ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 3వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పీజీ కోర్సుల్లో 55 శాతం ఉత్తీర్ణత ఉండాలని నెట్ సెట్, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని 4వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా నాగరాజు



రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చీమల నాగరాజు బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా నియామకం అయ్యారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జంగా రాజవెంకటనరసింహారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నాగరాజు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏబీవీ డిగ్రీ కళాశాల సందర్శన



జనగామ రూరల్: పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలను శుక్రవారం ఇగ్నో డైరెక్టర్ ఎంఎస్ సేనమ్ రాజు సందర్శించారు. కళాశాలలో 1985 నుంచి 1999 వరకు కామర్స్ అధ్యాపకుడిగా సేవలందించిన నాటి స్మృతులను నేమరువేసుకున్నారు. ఇగ్నో సెంటర్‌కు అవసరమైన అన్ని సౌకర్యాలు కళాశాలలో ఉన్నాయని, పీజీ సెంటర్‌ను మంజూరు చేస్తామన్నారు. ఇందుకు కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఇగ్నో సెంటర్ వరంగల్‌లోని ఎల్ బీ కళాశాలలో అందుబాటులో ఉందని, జనగామలో అందుబాటులో ఉంటే నూతన కోర్సుల్లో విద్యార్థులు చేరే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం | ఎవరికిద్దాం..!

- రేపటి నుంచి పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశాలు
- సహకార, వ్యవసాయ శాఖలకు సర్కారు ఆదేశాలు
- వచ్చే నెల 3 వరకు అభిప్రాయ సేకరణ



జనగామ: రైతులకు పెట్టుబడి సాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో క్లారిటీ ఇవ్వనుంది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో గుట్టలు, చెట్లు, సాగుబడిలో లేని భూములకు సైతం పెట్టుబడి ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. రైతు భరోసా పథకం ద్వారా యాసంగి, వానాకాలం రెండు సీజన్లకు ఎకరాకు రూ.15వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఐదు గ్యారంటీ స్కీంల్లో రుణమాఫీ చేసేందుకు సన్నద్ధమవుతూనే.. పెట్టుబడి సాయం కోసం రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు సర్వసభ్య సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో (పీఏసీఎస్) జనరల్ బాడీ మీటింగ్‌లు ఏర్పాటు చేసి, అందులో ఉన్న సభ్యుల అభిప్రాయాలు తీసుకోవాలని రాష్ట్ర సహకార శాఖ, రిజిస్ట్రార్ డైరెక్టర్ ఎం.హరిత ఈ నెల 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీలోపు ఒకే సెషన్‌లో సహకార సొసైటీల సర్వసభ్య సమావేశాలు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ, సహకార శాఖలను ఆదేశించారు. రైతులకు పెట్టుబడి సాయం ద్వారా ఒక్కో సీజన్‌కు రూ.7,500 చొప్పున రెండు సార్లు రూ.15వేలు అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రైతులకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఐదు గ్యారంటీ పథకాలు అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఇందులో రూ.2 లక్షల రుణమాఫీ ఒకే విడతలో మాఫీ చేసేలా రాష్ట్ర స్థాయిలో కసరత్తు చేస్తుండగా, ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి పెట్టుబడి సాయం సైతం జమ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. రికార్డు పరంగా ఉన్న వ్యవసాయ భూమిని ప్రాతిపదికన తీసుకోకుండా, వాస్తవికతను పరిశీలించనున్నారు. యాసంగి, వానాకాలం రెండింటి మధ్య కత్తెర పంట (జనగామ జిల్లాలో ప్రత్యేకత) సాగు చేస్తున్న నిజమైన రైతులకు మాత్రమే ఏడాదికి రూ.15వేల పెట్టుబడి సాయం ఇచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా కసరత్తు చేస్తోంది. గడిచిన యాసంగి సీజన్‌లో 1.80 లక్షల మంది రైతులకు రూ.202 కోట్ల పెట్టుబడి సాయం రావాల్సి ఉండగా, మరో రూ.44 లక్షలు జమ చేస్తే వందశాతం పూర్తవుతుంది. వ్యవసాయం చేసుకునే నిజమైన రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలనే నిబంధనలు వస్తున్న నేపథ్యంలో ఈ జాబితాలో నుంచి 25 శాతం మంది వరకు ఎగిరి పోయే అవకాశం లేకపోలేదని తెలుస్తుంది.

పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశాలు

రైతు భరోసా పథకంపై చిన్న, సన్నకారుల రైతులు, సాగులో లేని భూములతో పాటు ఇందులో ఉన్న సమస్యలపై సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న రైతుల అభిప్రాయాలను తీసుకునేందుకు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పీఏసీఎస్ సొసైటీలో సర్వసభ్య సమావేశాలను నిర్వహించనున్నారు. జిల్లాలో 14 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,00,356 మంది రైతులు సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరితో భవిష్యత్‌లో రైతుభరోసా పథకం అమలు తీరుతెన్నులపై ముఖాముఖిగా చర్చించనున్నారు. జిల్లా వ్యవసాయ, సహకార సొసైటీల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. ఇందులో రైతుల సలహాలు, సూచనలు, రైతుభరోసా అమలుపై వారి అభిప్రాయాలను ఒకేచోట క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని ఉత్తర్వుల కాపీలో పేర్కొన్నారు.

పీఏసీఎస్‌ల వారీగా సమావేశాల తేదీల వివరాలు

పీఏసీఎస్	సభ్యులు	తేదీ	సమయం	అధికారి
దేవరుప్పుల	11,647	30	ఉదయం 10.30	డీసీఓ
కొడకండ్ల	13,838	30	మధ్యాహ్నం 2.00	డీసీఓ
జనగామ	6,572	జూలై 1	10.30	డీసీఓ
చీటకోడూరు	4,149	1	2.00	డీసీఓ
బచ్చన్నపేట	8,450	1	10.30	డీసీఓ
నర్మెట	11,613	1	2.00	డీసీఓ
నిడిగొండ	3,582	జూలై 2	10.30	డీసీఓ
కంచనపల్లి	7,085	2	2.00	డీసీఓ
జఫర్‌గఢ్	7,725	2	10.30	డీసీఓ
స్టేషన్‌ఘన్‌పూర్	7,714	2	2.00	డీసీఓ
పాలకుర్తి	9,006	జూలై 3	10.30	డీసీఓ
ఎల్లరాయని తొర్రూరు	5,613	3	2.00	డీసీఓ
క్లోం	797	3	10.30	డీసీఓ
లింగాలఘణపురం	3,565	3	2.00	డీసీఓ

రేపటి నుంచి సర్వసభ్య సమావేశాలు



పెట్టుబడి సాయం కోసం రైతుల నుంచి అభిప్రాయాల సేకరణకు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3 వరకు పీఏసీఎస్ సొసైటీల సర్వసభ్య సమావేశాలు నిర్వహించనుంది. పెట్టుబడి సాయం అర్హతపై సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న రైతుల అభిప్రాలను తీసుకుంటున్నారు. జిల్లా వ్యవసాయ, సహకార సొసైటీల సంయుక్త భాగస్వామ్యంతో సర్వసభ్య సమావేశాలు జరుగుతాయి.

- వినోద్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

వరంగల్‌కు నేడు సీఎం రాక

- అభివృద్ధి పనుల పరిశీలన, సమీక్ష నిర్వహించనున్న రేవంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించనున్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ), నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శిస్తారు. అలాగే గ్రేటర్ వరంగల్ సమగ్ర అభివృద్ధితో పాటు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించనున్నారు. ఈ మేరకు సీఎంఓ వర్గాలు సీఎం టూర్ షెడ్యూల్ విడుదల చేశాయి.

టూర్ షెడ్యూల్ ఇలా..

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 1.30 గంటలకు కాకతీయ టెక్స్ టైల్ పార్క్‌కు చేరుకుంటారు. 1.30 నుంచి 1.50 గంటల వరకు పార్కును సందర్శిస్తారు.

- 1.50 గంటలకు టెక్స్‌టైల్ పార్క్ నుంచి బయలుదేరి రంగంపేట వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శిస్తారు.
- 2.30 గంటలకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 2.45 నుంచి 3.00 గంటల మధ్య మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభిస్తారు.
- 3.00 నుంచి 5.30 గంటల వరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కార్యకలాపాలు, సమస్యలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం.
- 5.40 నుంచి 6.10 గంటల వరకు హంటర్ రోడ్డులో మెడికోవర్ ఆస్పత్రి ప్రారంభం
- 6.10 గంటలకు : హంటర్ రోడ్డు నుంచి బయలుదేరి 6.30 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు.
- 6.30 గంటలకు : ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు పయనం.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్‌లో నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థానికంగా ఉన్న ఆర్టీసీకి చెందిన స్థలాన్ని ఎమ్మెల్యే శుక్రవారం సందర్శించారు. అనంతరం మండలంలోని నమిలిగొండ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వంటగదిని పరిశీలించి వంట చేసే వారితో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

లెక్చరర్‌గా మారిన ఎమ్మెల్యే

మోడల్ స్కూల్‌ను సందర్శించిన సమయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైన్స్ లెక్చరర్‌గా మారి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధించారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం విషయమై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా త్వరలో వంద పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణం చేసేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన్‌పూర్‌లో జాతీయ రహదారికి సమీపాన ప్రజలకు అందుబాటులో నాలుగు ఎకరాల ఆర్టీసీ స్థలం వంద పడకల ఆస్పత్రికి ఎంతో అనువుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, ఆర్డీఓ డీఎస్ వెంకన్న, ఏసీపీ భీమ్‌శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమాదేవి, మండల నోడల్ అధికారి కొమురయ్య, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఎస్‌ఓ కృష్ణవేణి, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్.నరేందర్‌రెడ్డి, సారంగపాణి, గట్టయ్య, శిరీష్‌రెడ్డి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే కడియం

డీఈఓ దిష్టిబొమ్మ దహనం

జనగామ రూరల్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో నింబధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయాలు చేపడుతున్నా.. జిల్లా విద్యాశాఖాధికారి చర్యలు తీసుకోకపోవడం సరికాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి అన్నారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చౌరస్తాలో డీఈఓ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల్లో విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని, ఫీజుల పేరుతో పేద విద్యార్థుల నుంచి దోపిడీ చేస్తున్నారన్నారు. పాఠశాలలపై పర్యావేక్షణ కరువైందని మండి పడ్డారు. జిల్లా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తిక్, వంశీ, నితిష్, అరవింద్, అరుణ్, వీరేందర్, ఉదయ్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్యకర్తలు

టెన్త్ సప్లమెంటరీలో 99.13 శాతం ఉత్తీర్ణత
జనగామ రూరల్: పదో తరగతి సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా 99.13 శాతం ఉత్తీర్ణత సాధించారని డీఈఓ కె. రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్లమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 117 మంది విద్యార్థులు హాజరు కాగా 116 ఉత్తీర్ణత సాధించారన్నారు. బాలురు 71 మంది హాజరు కాగా 70 మంది ఉత్తీర్ణత సాధించగా బాలికలు 46 మంది హాజరు కాగా 46 మంది ఉత్తీర్ణత సాధించారని డీఈఓ తెలిపారు. బాలికలు 100 శాతం ఉండగా బాలురు 98.59 శాతంగా ఉన్నారన్నారు.

పలువురిపై కేసు నమోదు

జనగామ రూరల్: అక్రమంగా గుట్కా ప్యాకెట్లు, మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని పెద్దపహడ్ గ్రామంలో బెల్ట్‌షాపులో అక్రమంగా గుట్కా ప్యాకెట్లు, మద్యం విక్రయిస్తున్నారే సమాచారంతో గ్రామంలో సోదాలు చేయగా మద్యం, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన హరిప్రసాద్, రాజగోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం, గుట్కా ప్యాకెట్లు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తుకు బానిస కావొద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ రఘు, ఎస్సై సృజన్, పీసీలు జితేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మద్యం బాటిళ్లు చూపుతున్న పోలీసులు

సదరం క్యాంపునకు 18 మంది హాజరు

జనగామ రూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం దృష్టిలోపం ఉన్న వారికి సదరం క్యాంపు నిర్వహించినట్లు డీపీఎం డి.వినిత శుక్రవారం తెలిపారు. 25 మందికి ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోగా 18 మంది హాజరు అయ్యారన్నారు. వారికి పరీక్షలు నిర్వహించి, అర్హత పొందిన వారికి సదరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సృజన్‌కుమార్, శ్రీనాథ్, తేజశ్రీ, ఉమాదేవి, కే. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి

జనగామ రూరల్: జిల్లాలోని శామీర్‌పేటలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్‌లకు విద్యార్థులు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. బింధు మాదురి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 7వ తేదీలోగా కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, కంప్యూటర్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ వెంట దోస్త్ దరఖాస్తు ఫారం తీసుకోని రావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటినుంచి నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 29 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 29, జూలై 2, 4, 6వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ పరీక్షల్లో ఒకరు డీబార్

కాకతీయ యూనివర్సిటీ పరిధి ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ పరీక్షలకు శుక్రవారం 2,673 మంది విద్యార్థులకు 1952 మంది హాజరయ్యారు. నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఒకరు కాపీయింగ్ చేస్తూ పట్టుబడగా డీబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

దూరవిద్య సైన్స్ కోర్సుల ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్యాకేంద్రం అందిస్తున్న పీజీ సైన్స్ కోర్సుల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జూలై 15 వరకు ఫీజులు చెల్లించాలని దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.రాంచంద్రం, సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటగోపినాథ్ ఒక ప్రకటనలో కోరారు. త్వరలోనే తరగతులు ప్రారంభమవుతాయని కోర్సు ఫీజుతోపాటు పరీక్ష ఫీజు కూడా చెల్లించాల్సింటుందన్నారు. ఫీజులను ఎస్‌బీఐ/యూబీఐ ద్వారా డైరెక్టర్, ఎస్డీఎల్‌సీఈ కేయూ పేర వరంగల్‌లో చెల్లుబాటయ్యేలా డీడీ లేదా దూరవిద్యాకేంద్రంలోని ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌లో చలానా ద్వారా చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 0870-2461480 నంబర్లలో సంప్రదించాలన్నారు.



పట్టాలు తప్పిన గూడ్స్ గార్డు బోగి

● సమన్వయ లోపమే కారణమా..?



పట్టాలు తప్పిన గార్డు బోగి

జనగామ: జనగామ జిల్లా రైల్వేస్టేషన్ ఏరియాలోని వ్యాగన్ పాయింట్ సైడింగ్ లైన్‌లో ఓ గూడ్స్ రైలు గార్డు బోగి పట్టాలు తప్పిన ఘటన శుక్రవారం తెల్లవారుజాము 4 గంటలకు జరిగింది. ఒక్కసారిగా పెద్ద శబ్దాలు రావడంతో సమీపంలో నివాసముంటున్న కుటుంబాల వారు ఉలిక్కి పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. జనగామ మండలం యశ్వంతాపూర్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాం నుంచి కర్ణాటక దేవన్‌గేర్‌కు బియ్యం తీసుకెళ్లేందుకు 42 బోగీల గూడ్స్ రైలు వచ్చింది. సైడింగ్ లైన్(ప్రత్యేక వ్యాగన్ పాయింట్) ట్రాక్‌పై గూడ్స్ రైలు వచ్చే క్రమంలో గార్డు, పాయిలెట్ మధ్య సమన్వయ లోపం కారణంగా గార్డు ఉన్న బోగి పట్టాలు తప్పింది. గార్డు వాకీ టాక్ ద్వారా రైలు డ్రైవర్‌ను అప్రమత్తం చేసే క్రమంలో.. అతని వాకీటాక్ పని చేయలేదని తెలుస్తున్నది. దీంతో పట్టాలు దాటి రైలు వెళ్లడంతో గార్డు బోగి ట్రాక్ తప్పి కిందకు వచ్చింది. సమాచారం అందుకున్న దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ట్రాక్ మరమ్మతులు, గూడ్స్ బోగిల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సాయంత్రం 4.30 గంటలకు ట్రాక్ మరమ్మతు పనులు పూర్తి చేసి గార్డు బోగిని పట్టాలు ఎక్కించారు. అప్పటికే 42 బోగిల్లో 2,684 టన్నుల బియ్యం లోడింగ్ చేసి రాత్రి వరకు రైలును పంపించారు. కాగా గార్డు, డ్రైవర్ నిర్లక్ష్యంతో పట్టాలు తప్పిన బోగి ఘటనపై దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జూలై 4, సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించినట్లు రిజిస్ట్రార్ పి.రఘురామి రెడ్డి తెలిపారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులై టీఎస్ పాలిసెట్ పరీక్ష రాసి ర్యాంకు పొందిన వారు అర్హులని వివరించారు. ఈ కోర్సుల్లో మొత్తం 800 సీట్లు ఉండగా ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో 260, ప్రైవేటు కళాశాలల్లో 540 ఉన్నాయన్నారు. 60 శాతం రూరల్ కోటాలో, 40 శాతం సీట్లు నాన్ రూరల్ కోటాలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రూరల్ కోటాలో ప్రవేశం కోసం విద్యార్థి ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏవేని నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివినట్లు పాఠశాల హెచ్‌ఎంలు సంతకం చేసి ధ్రువీకరించిన పత్రాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే విధానం, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్న ప్రదేశాలు, కోర్సుల ఫీజులు, సమగ్ర సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.





సర్దడానికి సతమతం



కాజీపేట ఎఫ్‌సీఐ ప్రధాన గేట్



బియ్యం నిల్వలతో కళకళలాడుతున్న గోడౌన్లు

బియ్యం నిల్వలతో నిండిన ఎఫ్‌సీఐ గోదాంలు

- ప్రత్యేక రేకుల కోసం అధికారుల వినతి
- ప్రైవేట్ గోడౌన్ల లీజుకు ప్రయత్నాలు

కాజీపేట: కాజీపేట భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో బియ్యం నిల్వలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. నిర్దేశించిన లక్ష్యం మేరకు గూడ్స్ రైళ్లు(రేకులు) రాకపోవడంతో, మిల్లర్ల నుంచి సీఎంఆర్ వస్తుండడంతో గోడౌన్లు భర్తీ అవుతున్నాయి. జిల్లా నుంచి సీఎంఆర్ బియ్యం లారీలు తరలివస్తున్న నేపథ్యంలో.. నిల్వ చేయడానికి గోడౌన్లలో సరిపడా స్థలం లేక సర్దడానికి అధికారులు సతమతమవుతున్నారు. బియ్యం లారీలను సంబంధిత అధికారులు సకాలంలో లోపలికి అనుమతించకపోవడంతో లారీలు రహదారుల వెంట, ఎఫ్‌సీఐ రహదారిలో నిలిచి ఉంటున్నాయి. గతేడాది కాలంగా బియ్యం అంతంత మాత్రంగానే.. ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంతో కొత్తగా వచ్చే బియ్యం బస్తాల్ని నిల్వ చేయడం కష్టంగా మారింది. ఇది ఒక కాజీపేట ఎఫ్‌సీఐ గోడౌన్ పరిస్థితే కాదు. వరంగల్, నెక్కొండ, యశ్వంతపూర్‌లోనూ ఇదే పరిస్థితి.

ఉమ్మడి జిల్లాలో గోడౌన్లలో నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో)

గోడౌన్లు	సామర్థ్యం	నిల్వలు
కాజీపేట	1,10,000	90,000
ఏనుమాముల టీజీ ఎస్‌డబ్ల్యూసీ	15,000	5,000
ఏనుమాముల సీడబ్ల్యూసీ	5,000	5,000
నెక్కొండ	1,00,000	50,000
గొర్రెకుంట	20,000	20,000
రఘునాథపల్లి	30,000	25,000

రేకులు కేటాయించాలని వినతి

ఇతర రాష్ట్రాలకు బియ్యం నిల్వలను తరలించడానికి అవసరమైన గూడ్స్ రైళ్లను కేటాయించాలని ఎఫ్‌సీఐ అధికారులు కేంద్ర ప్రభుత్వంతో పాటు రైల్వే అధికారులకు విన్నవిస్తున్నా.. ఫలితం శూన్యమే అవుతోంది. అతి కష్టం మీద మే నెలలో రెండు గూడ్స్ రైళ్లు మాత్రమే రావడంతో బియ్యం నిల్వలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. దీంతో కొంతమేర గోడౌన్లలో ఖాళీ స్థలం ఏర్పడింది. దేశ వ్యాప్తంగా నీటి లభ్యత పెరగడంతో వరి పంటల సాగు సమృద్ధిగా పెరుగుతోంది. స్థానికంగానే దొడ్డు రకం బియ్యం లభిస్తుండడంతో దిగుమతి చేసుకోవాల్సిన అవసరం తప్పింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలి నిబంధనలను కాస్త సడలించడంతో ఇప్పుడిప్పుడే బియ్యం బయటి ప్రాంతాలకు ఎగుమతి చేసే పరిస్థితులు నెలకొన్నాయి. రైల్వే అధికారులు జూన్‌లో అయిదు గూడ్స్ రైళ్లను కేటాయిస్తే తప్ప బియ్యం నిల్వలు బయటి ప్రాంతాలకు తరలిపోయే పోవడంతోపాటు గోడౌన్లలో ఖాళీ స్థలం ఏర్పడే పరిస్థితి లేదని ఎఫ్‌సీఐ అధికారులు భావిస్తున్నారు.

అద్దె గోడౌన్ల కోసం వెదుకులాట

బియ్యం నిల్వలు గోడౌన్లలో పేరుకుపోవడం కారణంగా ఏం పాలుపోని స్థితిలో అధికారులున్నారు. అద్దె గోడౌన్ల కోసం వెదుకులాట ప్రారంభించారు. రఘునాథపల్లి, వర్ధన్నపేట, ఏనుమాముల, నెక్కొండ ప్రాంతాల్లోని ప్రైవేట్ గోడౌన్లను పరిశీలించారు. బియ్యం నిల్వ చేయడానికి, తరలించడానికి అనుకూలంగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రూ.30.38 కోట్ల ధాన్యం మాయం

- సీఎంఆర్ అందించకుండా మిల్లర్ల నిర్వాకం
- సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
- కేసముద్రంలో ఘటన



కేసముద్రం విలేజీలో ఓ రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో పలు రైస్ మిల్లులపై సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ (హైదరాబాద్), జిల్లా సివిల్ సప్లై అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో మూడు రైస్ మిల్లుల్లో రూ.30.38 కోట్ల విలువైన 11 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. సివిల్ సప్లై డీఎం కృష్ణవేణి, డీఎస్‌ఓ రాజేందర్ కథనం ప్రకారం.. సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అందించాల్సిన ధాన్యం మాయం చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఆయా మిల్లుల్లో అధికారులు వరుసగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కేసముద్రం విలేజ్‌లోని మహాదేవ రైస్ మిల్లులో రూ.12.79 కోట్ల విలువైన 5,087 మెట్రిక్ టన్నులు, మణికంఠ మిల్లులో రూ.3.79కోట్ల విలువైన 1236.26 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. కాగా, ఇటీవల మారుతి రైస్ ఇండస్ట్రీస్‌లో నిర్వహించిన తనిఖీల్లోనూ రూ.13.80కోట్ల విలువైన 4336.44 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా మిల్లర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తానికి సీఎంఆర్ కింద ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన ధాన్యం పెద్దమొత్తంలో మిల్లర్లు మాయం చేసిన విషయం సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి రావడం సంచలనం సృష్టించింది. కార్యక్రమంలో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు, తహసీల్దార్ దామోదర్, సెకండ్ ఎస్సై రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌లో డాష్ బోర్డు అప్లికేషన్

● సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



హన్మకొండ: డిస్కంకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని చూసేందుకు డాష్ బోర్డు అప్లికేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఫ్లూయెంట్ గ్రిడ్ కంపెనీ వారు యుటీలిటీ ఆపరేషన్ సెంటర్‌పై హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎండీ వరుణ్ రెడ్డి, డైరెక్టర్లు.. నూతన సాంకేతిక పద్ధతులు, వాటితో కలిగే ప్రయోజనాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ డాష్ బోర్డు అప్లికేషన్ ద్వారా వర్క్ ఫోర్స్ మేనేజ్‌మెంట్, ఔటేజ్ మేనేజిమెంట్ సిస్టం, డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్, వినియోగదారుల పోర్టల్, సిటిజన్ మేనేజ్‌మెంట్, మీటర్ డాటా మేనేజ్‌మెంట్, అస్సెట్ మేనేజ్‌మెంట్ వంటి సమగ్ర వివరాలు తెలుసుకునే వీలుంటుందన్నారు. బిల్లింగ్, కలెక్షన్, అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు కమాండ్ కంట్రోల్‌లా ఒకేచోట పూర్తి సమాచారం తెలుసుకునే వీలుంటుందన్నారు. ఎక్కడ ఏమీ జరిగినా ఆ సమాచారం ఇందులో తెలుసుకునే సదుపాయం ఉంటుందన్నారు. చాట్ బాట్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, తద్వారా వారి సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. కాలానికి అనుగుణంగా అవసరమైన సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ముందుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు కె.తిరుమల్ రావు, టి.మధుసూదన్, కె.కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు అన్నపూర్ణ, శ్రీనివాస్, డీఈ ఐటీ కే.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

5 నుంచి పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) జూలై 5వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్యజీ శుక్రవారం తెలిపారు. ఈ పీజీ కోర్సుల పరీక్షలు జూలై 1వ తేదీ నుంచి నిర్వహించాల్సిండగా కొందరు విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆ పరీక్షలను వాయిదావేసి జూలై 5వ తేదీనుంచి నిర్వహించనున్నామని వారు తెలిపారు. జూలై 5, 8, 10, 12, 15, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీర్లు

కాజీపేట అర్బన్ : మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా భారత గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక మెళకువలపై అవగాహన కల్పిస్తున్నట్లు సివిల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సీఎస్ఆర్ కె.ప్రసాద్ అన్నారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో 'పేవ్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఫర్ రూరల్ రోడ్స్ అనే అంశంపై' నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్(ఈడీ) ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకంలోని 45 మంది ఇంజనీర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు వెంకయ్య, శంకర్, వివిధ సంస్థల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



సుప్రియ మృతదేహం

జఫర్‌గఢ్: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని సూరారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కడదూరి రాజు నూతన ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నాడు. ఈ పనుల కోసం నీరు కావాల్సి ఉండగా అతడి భార్య సుప్రియ (25) మోటార్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుత్ తీగలను ప్లగ్‌లో పెడుతోంది. ఆ తీగలు చేతికి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పింది. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే జఫర్‌గఢ్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా సుప్రియ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవియాదవ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..



బాలు(ఫైల్)

కురవి: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సీరోలు మండలం చింతపల్లి గ్రామ శివారు కుమ్మరిబోడు తండాకు చెందిన బానోత్ బాలు(40) కుటుంబం జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. ఈ క్రమంలో అక్కడ దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆ దంపతులు ఈనెల 26వ తేదీన హైదరాబాద్ నుంచి తండాకు వచ్చారు. అదే రోజు గొడవ జరగడంతో బాలు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆదర్శప్రాయుడు పీవీ

● మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి: దివంగత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు ఆదర్శప్రాయుడని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. పీవీ 103వ జయంతి సందర్భంగా శుక్రవారం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు భూ సంస్కరణల చట్టం తీసుకొచ్చి ఎంతో మంది నిరుపేదలకు తన భూములన్నింటిని దానం చేసిన మహనీయుడు అని కొనియాడారు. పీవీ నరసింహారావు జీవిత చరిత్ర అందరికీ మార్గదర్శకమన్నారు. పీవీ నరసింహారావు దగ్గర ఇందిరాగాంధీ సలహాలు తీసుకుని వాటిని పాటించేవారని గుర్తు చేశారు. నాడే నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, భూసంస్కరణలు, విదేశాంగ విధానం, ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన మహానుభావుడు పీవీ నరసింహారావు అని కొనియాడారు. హుస్నాబాద్ నియోజకవర్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. భవిష్యత్‌లో హుస్నాబాద్ శాసన సభ సభ్యుడిగా తన నియోజక వర్గ ప్రజల గౌరవం పెంచనున్నట్లు స్పష్టం చేశారు. పీవీ నరసింహారావు ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సిరిసిల్ల రాజయ్య మాట్లాడారు. దేశానికే గొప్ప నాయకత్వం అందించి పాలనలో చెరగని ముద్రవేసిన నేత పీవీ నరసింహారావు అని కొనియాడారు. అష్టభాష కోవిదుడు మన పీవీని భారతరత్న వరించడం గర్వకారణమన్నారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనపై అక్రమ కేసులు మోపి జైలుకు పంపడం వల్లే తాను పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని చదువగలిగానని చెప్పారు. కేసీఆర్‌కు మరోసారి కృతజ్ఞతలు తెలుపుకోవాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కర్ణకంటి మంజులారెడ్డి, ఆర్డీఓ ఎస్.వెంకటేష్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వీరేశం, ఏసీపీ తిరుమల్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్ ఆర్.వెంకట్‌రెడ్డి, కావ్యలక్ష్మారెడ్డి, వెంకట్‌నారాయణ, నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, గోపిశర్మ, ఊసకోయిల ప్రకాశ్, ఆదరి రవి, కొలుగూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేయాలి

కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి మంత్రి మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ నుంచి ఎన్నికైన ఎంపీలు రాష్ట్ర విభజన హామీలను వెంటనే అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని పిలుపునిచ్చారు. విభజన హామీలకోసం తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెస్తే కాంగ్రెస్ ఎంపీలు సహకరిస్తారన్నారు.

పౌష్టికాహారం విషయంలో నిర్లక్ష్యం వద్దు

● రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న మంత్రి ధనసరి సీతక్క, కలెక్టర్ దివాకర

ములుగు: రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది.. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రాతో కలిసి ఏటూరు నాగారం మండలం ఆకులవారి ఘణపురంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆహారం సరిగా ఉంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారని, వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి గోదావరి తీరం వెంబడి ఉన్న రామన్నగూడెం, మంగపేట కరకట్టలను పరిశీలించారు. నూతన టెక్నాలజీతో కరకట్ట పనులు చేపట్టి భవిష్యత్‌లో ప్రజలు ఇబ్బందులు ఏర్పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ముఖ్యంగా సీజనల్ కాలంలో వైద్యులు గిరిజనుల గూడేలు, తండాల వాసులకు అందుబాటులో ఉండాలని, వచ్చే మూడు నెలలకు సరిపడా వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క–సారలమ్మలను మంత్రి దర్శించుకున్నారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆలయ పూజారులు, అధికారులు ఆహ్వానం పలికారు.

ఖోఖోకు అనుమతి ఇవ్వండి

● 'సాట్' ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌కు వినతి



వాణీప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఒలింపిక్స్ సంఘం బాధ్యులు, హనుమకొండ, వరంగల్ డీవైఎస్‌ఓలు అశోక్, సత్యవాణి

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఖోఖో, కబడ్డీ క్రీడాకారులకు అనుమతి ఇవ్వాలని వరంగల్ ఒలింపిక్స్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్, కోశాధికారి శ్యాంప్రసాద్.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ ప్రసాద్‌ను కోరారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలో నిర్వహిస్తున్న హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికల ప్రక్రియను ప్రారంభించారు. క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఒలింపిక్స్ సంఘం ఆధ్వర్యంలో స్టేడియంలో క్రీడా పోటీలు వీక్షించేందుకు గ్యాలరీ, ఇతర వసతులు కల్పించాలని వాణీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, ఇదివరకు ఉన్న హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో స్టేడియంలోని వేరే భవనంలో నిర్వహిస్తున్నామని, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్.. ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌ను కోరారు. అలాగే, రెండు సంవత్సరాల క్రితం ఏర్పడిన వరంగల్ డీఎస్ఏకు ఆదాయ వనరులు లేవని, నిధులు లేమితో క్రీడాకారులకు సరైన వసతులు కల్పించలేకపోతున్నామని వరంగల్ డీవైఎస్‌ఓ సత్యవాణి తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్.. ఉమ్మడి వరంగల్ క్రీడాభివృద్ధికి కావాల్సిన వసతులు, నిధులు గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు.

ఇంటర్ ప్రిటేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ పరిసర ప్రాంతంలో ప్రసాద్ ప్రాజెక్టు పథకంలో నిర్మిస్తున్న ఇంటర్ ప్రిటేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టూరిజం ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణీప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ న్యాలకొండ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇంటర్ ప్రిటేషన్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం రామప్ప దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్.. వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టూరిజం అధికారులు నాథన్, సరిత, శివాజీ, ఏఈ విజయ్‌కుమార్ ఉన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మామునూర్‌లో కుడా లే అవుట్ రెండు దిశలా చౌరస్తా నుండి మరియు జ్యోతి భాపులె ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పూరా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 268 అమ్మకానికి. 9032111600. [W-1242415]

SERVICES

CHANGE OF NAME

■ I, SHOBHANABOINA KRISHNA CHENDRA, S/o, SHOBHANABOINA SHIVARAJ, R/o. H.No. 1-5-46/1, Gimigadda, Jangaon. In my passport wrongly entered as SHOBHANABOINA KRISHAN CHENDRA, so I want of Change of My Name as SHOBHANABOINA KRISHNA CHENDRA (as per SSC Memo/Aadhar Card) in my passport. SHOBHANABOINA KRISHNA CHENDRA and SHOBHANABOINA KRISHAN CHENDRA both Names same or equal. Related to the same person. [W-1242492]

BEAUTICIAN / BEAUTY PARLOR

■ శ్రీశైలీ బ్యూటీపార్లర్ నందు గవర్నమెంట్ సర్టిఫికేట్‌తో Free Training ఇవ్వబడును. శ్రీశైలీ బ్యూటీ పార్లర్ చౌరస్తా, హన్మకొండ. సెల్: 9989060668. [WA-6503]

WANTED

■ Off. Executive/ Accountant (0-2 Yr. Exp. Related Mfg. Sal:8K-12K) Prod. Executive: Food/ Nutrition dip. Holder (Sal:10K-15K) Mark/Sales: Executives, Cold pressed organic/Natural Oils and Foods/ Grocery Products Related, Exp: 0-2Yr, (Sal:8K-20K). Resumes Send to Mail: veghannaturals@gmail.com or W.up to: 9919911016. [WA-6501]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185230]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి / భోజనం. జీతం: 18K. ఫోన్: 9160900024 / 9640400073. [H-799897]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.